


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 273, పేజీలు - 08
శనివారం, మార్చి 21, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# తెలంగాణ బడ్జెట్ @ 3.24 లక్షల కోట్లు

**తెలంగాణ బడ్జెట్ - రూ. 3,24,234 కోట్లు**
**రెవెన్యూ వ్యయం - 2,34,406 కోట్లు**
**మూలధన వ్యయం - 47,267 కోట్లు**

## - సంక్షేమం అభివృద్ధికే భట్టి బడ్జెట్

- దేశంలో నెంబర్ వన్ గా నిలబెట్టడమే లక్ష్యమన్న మల్లు భట్టి
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.33,688 కోట్ల కేటాయింపు
- రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు
- సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2026-27 వార్షిక బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ప్రజలు తమకు అప్పగించిన అధికారాన్ని బాధ్యతగా భావించి పాలన చేస్తున్నామని చెప్పారు. మభ్య పెట్టే ప్రజలకు చేయని వెల్లడించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ బడ్జెట్ ఉంటుందని భట్టి తన ప్రసంగంలో స్పష్టం చేసారు. రైతు సంక్షేమం.. మహిళా సాధికారత.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ బడ్జెట్ రూపకల్పన చేసినట్లు వివరించారు. రూ 3,24,234 లక్షల కోట్లతో బడ్జెట్ ను ప్రతిపాదించారు. శాఖల వారీగా కేటాయింపులను ప్రకటించారు. రెండేళ్ల పాలనలో ప్రజలకు మేమిచ్చిన వాగ్దానాలను వారు మాపై పెట్టుకున్న ఆశలను సంతృప్తి కరమైన స్థాయిలో నెరవేరుస్తూ వస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో భట్టి వెల్లడించారు. ఈ బడ్జెట్ లో రూ 2,34,406 కోట్లు రెవిన్యూ వ్యయంగా.. రూ 47,267 కోట్లు మూలధన వ్యయంగా బట్టి తన బడ్జెట్ లో ప్రతిపాదించారు. పశుసంవర్ధకశాఖ - రూ.1,529 కోట్లు, వ్యవసాయ శాఖ - రూ.23,179 కోట్లు కేటాయించారు. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

అదే విధంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతీ నెలా రూ 2 వేల చొప్పున స్కాలర్ షిప్ ఇవ్వనున్నట్లు భట్టి వెల్లడించారు. శాఖల వారీగా రైతు సంక్షేమం– రూ.23,179కోట్లు, సివిల్ సప్లయ్–రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖ - రూ.1,529 కోట్లు, విద్యుత్ - రూ.21,285 కోట్లు, విద్యా శాఖ - రూ.26,674 కోట్లు, వైద్యం - రూ.13,679కోట్లు, కార్మికుల సంక్షేమం - రూ.999 కోట్లు, మహిళా శిశు సంక్షేమం - రూ.3,143 కోట్లు, ఎస్సీ సంక్షేమం - రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం - రూ.7,937కోట్లు, బీసీ సంక్షేమం - రూ.12,511 కోట్లు, మైనారిటీ సంక్షేమం - రూ.3,769 కోట్లు కేటాయించారు. అదే విధంగా రాజీవ్ యువ వికాసం - రూ.6వేల కోట్లు, గృహ నిర్మాణం - రూ.7,430 కోట్లు, ఐటీ రంగం - రూ.875 కోట్లు, పరిశ్రమలు - రూ.3,490 కోట్లు, చేనేత - రూ.258 కోట్లు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి - రూ.33,688 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులు - రూ.22,615 కోట్లు, రవాణా శాఖ - రూ.12,759 కోట్లు, న్యాయ శాఖ - రూ.2,367 కోట్లు పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ - రూ.17,907కోట్లు ప్రతిపాదించారు. శాంతి భద్రతలు - రూ.11,907 కోట్లు, గోదావరి పుష్కరాలు - రూ.500 కోట్లు, పర్యాటక శాఖ - రూ.1,224 కోట్లు కేటాయించారు.

**రాష్ట్ర తలసరి ఆదాయం - 4లక్షల 18వేల 931 కోట్లు**
**తెలంగాణ వృద్ధి రేటు - 10.2 శాతం**
**జీఎస్డీపీ - రూ.17 లక్షల 82 వేల కోట్లు**
**గతేడాదితో పోలిస్తే 10.7 శాతం వృద్ధి**

## ఆరు గ్యారెంటీలకు రూ.50,713 కోట్లు



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం, ఆరు గ్యారెంటీలపై ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని మంత్రి తెలిపారు. ఆరు గ్యారెంటీల కోసం ఈ బడ్జెట్‌లో రూ. 50,713 కోట్లు కేటాయించబడ్డాయి. ఇందులో ప్రధానంగా: రైతు భరోసా – రూ. 18,000 కోట్లు చేయూత – రూ. 14,861 కోట్లు ఇందిరమ్మ ఇళ్ళు – రూ. 5,500 కోట్లు మహాలక్ష్మి పథకం – రూ. 4,305 కోట్లు సన్న వడ్ల బోనస్ – రూ. 3,500 కోట్లు గృహ జ్యోతి (200 యూనిట్లు ఉచిత విద్యుత్) – రూ. 2,080 కోట్లు తదితర కేటాయింపుల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీకి రూ. 1,143 కోట్లు, మహాలక్ష్మి పథకం కింద ఎల్‌పీజీ సబ్సిడీకి రూ. 723 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ. 600 కోట్లు కేటాయించారు.

---

తృణమూల్ ఎన్నికల
## మ్యానిఫెస్టో రిలీజ్
**- మమతా బెనర్జీ 10 హామీలు ఇవే**




కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు యావత్తు దేశాన్ని ఆకర్షిస్తున్నాయి. అధికార తృణమూల్ హ్యాట్రిక్ కొడుతుందా? బీజేపీ తొలిసారి అధికారం చేపడుతుందా? అనేది ఆసక్తికంగా మారింది. అధికార, విపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో బెంగాల్ రాజకీయాలు వేడెక్కాయి. ఈ నేపథ్యంలో టీఎంసీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల మేనిఫెస్టోను శుక్రవారం విడుదల చేశారు. వరుసగా నాలుగోసారి అధికారమే లక్ష్యంగా పది కీలక హామీలను దీదీ ప్రకటించారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. మమతా హామీల్లో మహిళలకు ఆర్థిక సాయం పెంపు,


2లో..

# యుద్ధం కొనసాగితే ఇబ్బందే

- పెట్రోల్, డీజిల్ కొరత రాకుండా చూడాలని సీఎం ఆదేశం
- ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సూచన
- అకాల వర్షాలతో రాష్ట్రంలో రూ.62 కోట్ల మేర పంట నష్టం అంచనా
- మొక్కజొన్న, వరితో పాటు ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం

అమరావతి (ప్రశ్న న్యూస్) ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసుపై (గ్లోబల్ సప్లయ్ చైన్) తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎరువుల కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైన నిల్వల కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇంధన సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని

2లో..



## అన్నీ ఉమ్మడి ఆస్తులే..
**అందరికీ సమానంగా చెందుతాయి**
**- వైఎస్ విజయమ్మ సంచలన అఫిడవిట్**



**అమరావతి** (ప్రశ్న న్యూస్) దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో ఆస్తుల చిచ్చు మరోసారి బహిర్గతమైంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సోదరి షర్మిల, తల్లి విజయమ్మలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో వేసిన పిటిషన్‌కు కౌంటర్‌గా విజయమ్మ శుక్రవారం ఒక కీలక అఫిడవిట్‌ను దాఖలు చేశారు. " వైఎస్సార్ బ్రతికున్నంత వరకు ఆస్తుల పంపకం జరగలేదు.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని ఆమె ఈ అఫిడవిట్ ద్వారా స్పష్టం చేశారు.

2లో..

---

## కొత్త విద్యా విధానంలో టెన్త్ పరీక్షలు ఉండవు
**- రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



2లో..

## అంకెల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీలేదు
**- తెలంగాణ బడ్జెట్‌పై స్పందించిన హరీశ్ రావు**



2లో..

ఒక్కో కుటుంబంపై
# రూ.9 లక్షల అప్పు
**- ఇది ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వం**
**- రివిజన్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ అంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో అన్ని వర్గాల వారిని మోసం చేస్తారని కవిత మండిపడ్డారు. బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు అందరినీ మోసం చేశారని కవిత ధ్వజమెత్తారు.

**మంత్రులు ఒకరిని మించి ఒకరు ఫేక్ ముచ్చట్లు**

ఒక్కో కుటుంబంపై రూ.9లక్షల అప్పుమోపారన్నారు. బడ్జెట్ లో తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒకరిని మించి ఒకరు ఫేక్ ముచ్చట్లు చెబుతున్నారని మండిపడ్డారు.మోడీ బడే భాయ్

2లో..

## భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టింది

- అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలు తప్ప ఏమీ లేదన్న బండి
- విద్యకు 16 శాతం నిధులు కావాలంటే 8 శాతమే కేటాయించారు
- రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తోంది



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెట్టడాన్ని ఉద్దేశించి

2లో..

## అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు
**- సుప్రీంకోర్టు కీలక తీర్పు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది.

**కేసు నేపథ్యం ఏమిటంటే..**

గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురు

2లో..

ఆన్‌లైన్ జూదానికి
# చెక్
**- 300 యాప్‌లు, వెబ్‌సైట్లపై కేంద్రం వేటు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో 300 గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. దీంతో ఇప్పటివరకు బ్లాక్ చేసిన

2లో..

# తృణమూల్ ఎన్నికల మ్యానిఫెస్టో రిలీజ్

నిరుద్యోగ భృతి, పాఠశాలలు ఆధునికీకరణ, కొత్త జిల్లాలు, మున్సిపాల్టీలు ఏర్పాటు, ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ తదితరాలు ఉన్నాయి. ఇప్పటికే ఎన్నికల్లో పోటీచేసే 291 మందితో టీఎంసీ పూర్తి జాబితాను ఒకేసారి మమతా విడుదల చేసిన సంగతి తెలిసిందే. 77 మంది సిట్టింగ్‌లకు ఈసారి టిక్కెట్ నిరాకరించారు. ప్రస్తుతం నెల నెల మహిళలకు ఇస్తున్న రూ.1,000 ఆర్థిక సాయాన్ని మరో రూ.500 పెంచుతామని పేర్కొన్నారు. దీంతో జనరల్ మహిళలకు రూ.1500, ఎస్సీ/ ఎస్టీలకు రూ.1700 చొప్పున అందజేయనున్నట్టు దీదీ తెలిపారు. నిరుద్యోగ యువతకు భృతి కింద నెలకు రూ.1,500 ఇస్తామని ప్రకటించారు. ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని, ఇందుకోసం వైద్యశిబిరాలను ఏర్పాటుచేస్తామని బెంగాల్ సీఎం హామీ ఇచ్చారు. పాఠశాలలను అధునీకరించి, ఈ-లెర్నింగ్ సౌకర్యాలను కల్పిస్తామని మమతా తెలిపారు.కొత్తగా మరో ఏడు జిల్లాలు, మున్సిపాల్టీలను ఏర్పాటుచేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. రైతుల కోసం రూ.30 వేల కోట్లతో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను తీసుకొస్తామని అన్నారు. ప్రతి కుటుంబానికీ పక్కా ఇంటి నిర్మాణం, ఇంటింటికీ శుద్ధిచేసిన తాగునీటి అందేలా చర్యలు తీసుకుంటామని మేనిఫెస్టోలో వెల్లడించారు. ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, పోర్టులు, వాణిజ్య మౌలిక వసతులు, అత్యాధునిక గ్లోబల్ ట్రేడ్ సెంటర్‌ను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని పెట్టుబడులు, వ్యాపారాలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని వివరించారు. అర్హులైన అందరికీ వృద్ధాప్య పింఛన్లు నిరంతరాయంగా అందజేస్తామని మమతా బెనర్జీ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మరోసారి కేంద్రంలోని బీజేపీతో పాటు ఎన్నికల కమిషన్‌పై దీదీ విరుచుకుపడ్డారు. ఎన్నికల తర్వాత ఎన్ఆర్సీ, జనాభా లెక్కల సేకరణ పేరుతో ప్రజల పౌరసత్వాన్ని తొలగించేందుకు మోదీ సర్కారులు ప్రణాళికలు రచిస్తోందని దుయ్యబట్టారు. అంతేకాదు, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు సహకరించేలా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు ఈసీ, కేంద్రం కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఓడిపోతారని బీజేపీకి తెలుసు కాబట్టే బెంగాల్‌లో 'అనధికార రాష్ట్రపతి పాలన'ను విధించారని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడుకోడానికి బీజేపీకి వ్యతిరేకంగా కలిసి పోరాటం చేయాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. బెదిరింపులు, ప్రలోభాలకు గురిచేసినా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. తనకు అన్ని మతాలూ సమానమేనని, విభజన రాజకీయాలు చేయడంలేదని తెలిపారు. పశ్చిమ్ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనున్నాయి. ఓట్లను మే 4న లెక్కించి ఫలితాలు వెలువడనున్నాయి.

# యుద్ధం కొనసాగితే ఇబ్బందే

సూచించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా (పీఎన్‌జీ), ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను పటిష్ఠం చేయాలని స్పష్టం చేశారు. ఎల్పీజీ సరఫరా వ్యవస్థను సమీక్షిస్తూ గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు విద్యా సంస్థలు, ఆలయాలకు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం దిశానిర్దేశం చేశారు.అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమావేశంలో, రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై కూడా ఆయన వరుసగా రెండో రోజూ సమీక్ష నిర్వహించారు. భారీ గాలులు, వడగళ్లతో కూడిన వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నష్టం వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని, దీని విలువ సుమారు రూ.40 కోట్లుగా ఉంటుందని తెలిపారు. అలాగే, 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, మామిడి, నిమ్మ, నారింజ వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. ఈ నష్టం విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేశారు. మొత్తం మీద రాష్ట్రవ్యాప్తంగా రూ.62 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు నివేదించారు.

# అన్నీ ఉమ్మడి ఆస్తులే..

### అఫిడవిట్‌లోని ప్రధానాంశాలు

విజయమ్మ తన అఫిడవిట్‌లో జగన్ వాదనలను పూర్తిగా తప్పుపట్టారు. 2009లో వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే. ఆస్తుల పంపకం ఎప్పుడూ అధికారికంగా జరగలేదన్నారు. తన మనవలు, మనవరాళ్లు నలుగురికి ఆస్తులను సమానంగా పంచాలన్నదే వైఎస్సార్ ఉద్దేశ్యం, ఆజ్ఞ అని ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు, ఎంఓయూ లో లేని బెంగళూరులోని యలహంక ఇల్లు కూడా షర్మిలదేనని, అది వైఎస్సార్ ఆజ్ఞ అని తెలిపారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి అంటే షర్మిల పిల్లలకు అన్యాయం చేశాడని, ఇప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అఫిడవిట్‌ను వైఎస్ విజయమ్మ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో సమర్పించారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ల బదిలీకి సంబంధించి జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఆమె ఈ వివరణ ఇచ్చారు. ఈ పత్రాన్ని నోటరీ చేయించి, అధికారికంగా ట్రిబ్యూనల్‌కు అందజేశారు.షర్మిల ఆస్తుల కోసం పాకులాడుతోందంటూ జరుగుతున్న ప్రచారాన్ని విజయమ్మ తీవ్రంగా ఖండించారు. షర్మిల వద్ద ఉన్న ఆస్తులు జగన్ ఇచ్చినవి కావు, అవి ఆమెకు రావాల్సిన వాటా మాత్రమే అని స్పష్టం చేశారు. అలాగే తనను బినామీగా చిత్రీకరించవద్దని, దేవుడి సాక్షిగా తాను చెబుతున్నవన్నీ వాస్తవాలేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసత్య ప్రచారాలను మానుకోవాలని మీడియాను వేడుకున్నారు. గతంలో వైఎస్ జగన్, షర్మిల మధ్య జరిగిన ఎంఓయూ ప్రకారం కొన్ని ఆస్తులను బహుమతిగా ఇస్తానని జగన్ పేర్కొన్నారు. అయితే, రాజకీయ కారణాలు, ఇతర విభేదాల వల్ల ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు జగన్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించగా, అది తన హక్కు అని షర్మిల వాదిస్తున్నారు. ఇప్పుడు విజయమ్మ నేరుగా రంగంలోకి దిగి షర్మిల వైపు నిలబడటంతో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది.

# ఆన్‌లైన్ జూదానికి చెక్

వాటి సంఖ్య 8,400కు చేరిందని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. బ్లాక్ చేసిన వాటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటివి అందించే ఆన్‌లైన్ క్యాసినోలు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. వీటితో పాటు సట్టా/మట్కా నెట్‌వర్క్‌లు, నిజమైన డబ్బుతో ఆడే కార్డ్ గేమ్ యాప్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.గతేడాది ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్, 2025' కింద ఈ చర్యలు తీసుకుంటున్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త చట్టం తర్వాతే సుమారు 4,900 వెబ్‌సైట్లను బ్లాక్ చేయడం గమనార్హం. ఈ చట్టం ప్రకారం పోకర్, రమ్మీ, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి నిజమైన డబ్బుతో కూడిన గేమ్‌లను అందిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధిస్తారు. ఈ పరిశ్రమను నియంత్రించేందుకు 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా'ను కూడా ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడం, యువత వ్యసనాలకు బానిసలు కావడం, కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కూడా 'గేమింగ్ డిజార్డర్'ను ఒక ఆరోగ్య సమస్యగా గుర్తించింది. అయితే, ఈ చట్టం అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను వ్యతిరేకించడం లేదు. ఈ-స్పోర్ట్స్, సురక్షితమైన సోషల్, ఎడ్యుకేషనల్ గేమ్‌లను ప్రోత్సహిస్తోంది. లాభాల ఆశ చూపి వినియోగదారులను దోపిడీ చేసే బెట్టింగ్, గ్యాంబ్లింగ్ గేమ్‌లకు, నైపుణ్యాన్ని పెంచే గేమ్‌లకు మధ్య స్పష్టమైన తేడాను ఈ చట్టం చూపిస్తోంది.

# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

అప్పుల వాళ్లు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఆ నోట్‌లో తొమ్మిది మంది రుణదాతల పేర్లను పేర్కొన్నాడు. వారిలో ఒకరైన ధీరూభాయ్ నంజీభాయ్ పటేల్ లోత్వాలాపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 506(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల వ్యవధిలో నిందితుడు సుమారు 40 సార్లు ఫోన్ చేసినట్లు కాల్ రికార్డులను ప్రాసిక్యూషన్ ఆధారాలుగా చూపింది. తనపై కేసును కొట్టివేయాలని ధీరూభాయ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

### సుప్రీంకోర్టు ఏమంది?

ఈ కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని అభిప్రాయపడింది. "సూసైడ్ నోట్‌లో తొమ్మిది మంది పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టంగా లేదు. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు, ఎక్కడ జరిగాయనే వివరాలు లేవు. అందరు రుణదాతలను ఒకే గాటన కట్టారు. ఇలాంటి సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ జరపడం వృథా ప్రయాస అవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది. అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని, కేవలం ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్, తదుపరి చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

# భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టింది

ఆయన అన్నారు. తెలంగాణ బడ్జెట్‌పై ఆయన స్పందించారు. అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలు తప్ప ఏమీలేదని అన్నారు. ఆదాయాన్ని రాకుండా చేసి, అప్పులకోసం అర్రులు చాచే బడ్జెట్‌గా కనిపిస్తోందని విమర్శించారు. రైతు భరోసా డబ్బులు రెండు విడతలుగా ఎగ్గొట్టినట్లే అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటికీ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యా శాఖ కమిషన్ ప్రతిపాదిస్తే కేవలం 8 శాతమే కేటాయించారని అన్నారు. ఆరోగ్యశ్రీ బడ్జెట్‌కు కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని చురక అంటించారు. దేవాదాయ శాఖకు గత బడ్జెట్‌లో రూ.190 కోట్లు కేటాయిస్తే, ఈసారి ఆ ప్రస్తావన లేదని అన్నారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కేటాయింపులు తూతూమంత్రంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 56 శాతం బీసీ జనాభాకు నాలుగు శాతం కేటాయింపులు విడ్డూరమని బండి సంజయ్ అన్నారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని, ఇష్టారాజ్యంగా అప్పులు చేసేందుకు సిద్ధపడ్డట్లుగా ఈ బడ్జెట్ కనిపిస్తోందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని బయటకు తీసుకువచ్చి విచారణ చేపడతామని అన్నారు.

# ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు

అని ఢిల్లీకి పోయి వందరూపాయలు కూడా తేలేదని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ మా హైదరాబాదీ సలీం ఫేక్ లాంటి వ్యక్తి అన్న కవిత సలీం ఫేక్ కనీసం ప్రజలను నవ్విస్తాడు కానీ రాహుల్ మా ప్రజలను ఏడిపిస్తున్నారన్నారు.

### ప్రభుత్వానికి విజన్ లేదని అందుకే రివిజన్ బడ్జెట్

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వం ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వమని కవిత పేర్కొన్నారు. అందుకే ఇక నుంచి రాహుల్ గాంధీకి "రాహుల్ ఫేక్" అని నామకరణం చేస్తున్నాం అన్నారు కవిత. రైతు భరోసా చేయూత పింఛన్లు సహా చాలా రంగాలకు గతేడాది కేటాయించిన నిధులను అక్షరం మార్చకుండా అలాగే కొత్త బడ్జెట్లో పెట్టారన్నారు. ఈ ప్రభుత్వానికి విజన్ లేదని అందుకే రివిజన్ బడ్జెట్ అంటున్నామని తెలిపారు.

### అప్పుల డబ్బులు ఏం చేస్తున్నారు

ఏటా బీసీలకు 20 వేల కోట్లు కేటాయిస్తామన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఫేక్ చెప్పారని మాత్రం నాలుగు శాతం నిధులు కేటాయించి బీసీలను మోసం చేశారన్నారు. లక్షల కోట్ల అప్పులు తెస్తున్న రేవంత్ సర్కార్ ఆ డబ్బులను ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రజలకు పైసా మేలు జరగలేదన్నారు. మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని స్కీమ్ ఈసారి కూడా పత్తా లేకుండా పోయిందన్నారు.

### నిరుద్యోగంలో తెలంగాణా రైజింగ్

ఇందిరమ్మ ఇళ్లకు గతేడాదితో పోలిస్తే ఈసారి ఏడు వేల కోట్ల రూపాయల కోత పెట్టారన్నారు. కొత్త ఉద్యోగాల నియామకాలకు ఎటువంటి కేటాయింపులు లేవని, తెలంగాణ నిరుద్యోగంలో రైజింగ్ అంటూ కవిత వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల పైన కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసుకుంటుందని మండిపడ్డారు. కేవలం 13 వేల ఉద్యోగాలను భర్తీ చేసి 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు కవిత.

# కొత్త విద్యా విధానంలో టెన్త్ పరీక్షలు ఉండవు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర విద్యావ్యవస్థలో తీసుకురాబోతున్న విప్లవాత్మక మార్పుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త విద్యా విధానంలో టెన్త్ పరీక్షలు ఉండవని ప్రకటించారు. విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో మార్చి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేస్తామన్నారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన కమిటీ నూతన విద్యావిధానంపై నివేదిక ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించిన ముఖ్యమైన మార్పు వన్ బోర్డ్ ఫర్ ఆల్ క్లాసెస్ . అంటే ప్రస్తుతం ఉన్న వేర్వేరు బోర్డులను కలిపి ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, విద్యా విధానాన్ని సరళీకృతం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ విద్యా విధానం ప్రకారం భవిష్యత్తులో టెన్త్ బోర్డు పరీక్షల ప్రాముఖ్యతను తగ్గించి, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా సెమిస్టర్ పద్ధతి ,ఇతర మూల్యాంకన పద్ధతులను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి దీటుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని గతంలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన విద్యా రంగాన్ని ప్రక్షాళన చేస్తామని, ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ ఒకే చోట నాణ్యమైన విద్య, వసతి కల్పిస్తామని చెబుతూ వస్తున్నారు.

కేవలం డిగ్రీలు పట్టా పుచ్చుకోవడం కాకుండా, విద్యార్థులకు చేతినిండా పని దొరికేలా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ని ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను రూపొందించి, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తామని చెప్పారు. దీనివల్ల చదువు పూర్తికాగానే యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, నిరుద్యోగ సమస్యను రూపుమాపవచ్చని ధీమా వ్యక్తం చేశారు. టాటా లాంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో ఐటీఐలను కూడా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారం విషయంలో ప్రభుత్వం రాజీ పడబోదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని, తద్వారా స్థానికంగా పర్యవేక్షణ మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం చేసిన పరీక్షల రద్దు అంశంపై ప్రభుత్వం త్వరలో క్లారిటీ ఇవ్వనుంది.

# అంకెల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీలేదు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బడ్జెట్‌పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టారని విమర్శించారు. అన్ని రంగాలకు మొండిచేయి చూపారని అన్నారు. ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండుసున్నా అని ఎద్దేవా చేశారు. అంకెల గారడీ, మాటల గారడీ తప్ప బడ్జెట్?లో ఏమీ లేదని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పరిస్థితి బాగా ఉందని చెబుతున్నారని, మరోవైపు మూడేళ్లు కాకుండానే మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీములు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో అవినీతి జరిగిందని స్వయంగా మంత్రి కుమార్తె ఆరోపణలు చేశారని గుర్తుచేశారు.బడ్జెట్‌ను చూస్తుంటే ఇదో బోగస్ బడ్జెట్ అని అర్థమవుతోందని హరీశ్ రావు విమర్శించారు. గతంలో నిధులు కూడా ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదని అన్నారు. ఇది కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వెనుక పిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని భట్టి విక్రమార్క రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందని అన్నారు. క్యూర్, రేర్, ప్యూర్ పేరుతో హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందని మండిపడ్డారు. కూల్చడాల మీద ఉన్న ప్రేమ నిర్మించడంపై లేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నల్గొండ పట్టణంలో అశా వర్కర్ల అందోళన

**నల్గోండ** నల్గొండ గడియారం సెంటర్ వద్ద మండు ఎండలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల నిరసన ట్రాఫిక్ జామ్ కు దారి తీసింది. స్థానిక మంత్రి కార్యాలయం ఇందిరా భవన్ ను సిఐటియు ఆశ వర్కర్ల యూనియన్ ముట్టడించింది.

ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఇందిరా భవన్ ముందు నిరసనకారులు బైఠాయించారు. ఆశా వర్కర్లకు రూ. 18,000/- ఫిక్స్ వేతనం వెంటనే అమలు చేయాలి. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఆశాల అన్ని సమస్యల పరిష్కారానికి ఎన్ఎహెచ్ఎం కింద తగిన నిధులు కేటాయించాలి.. ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం తగ్గించి, అదనపు భత్యాలు ఇవ్వాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలని అన్నారు.గర్భిణీలు, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశాలకు ప్రత్యేక గౌరవ వేతనం ఇవ్వాలి. ప్రమాద భీమా, ఆరోగ్య భీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సలీం, దండంపల్లి సత్తయ్య జిల్లా ఉపాధ్యక్షుడు, లకపాక రాజు,పింజర్ల సైదులు, ఆశా కార్యకర్త జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, వెంకటమ్మ, సునీత, సిఐటియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# ఇన్ ఫ్లుయెన్సర్ చేసిన రీల్ కు ప్రధాని మోదీ రిప్లయ్

## - చక్కెర వాడకాన్ని తగ్గించుకోవాలని సూచన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఓ సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ చేసిన సరదా విజ్ఞప్తికి స్పందించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, చక్కెర వాడకాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ యువరాజ్ దువా పోస్ట్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ రీల్‌ను ప్రధాని తన స్టోరీలో పంచుకున్నారు. వివరాల్లోకి వెళితే, యువరాజ్ దువా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సరదా రీల్ చేశారు. తన తండ్రి ఎక్కువగా స్వీట్లు తింటున్నారని, ఆయనకు ఎంత చెప్పినా వినడం లేదని, కానీ ప్రధాని మోదీ మాటలకు ఆయన ఎంతో విలువిస్తారని పేర్కొన్నారు. "మోదీజీ, ఒక చిన్న విన్నపం. మీరు తదుపరి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో చక్కెర వాడకం గురించి మాట్లాడితే, మా నాన్న స్వీట్లు తినడం తగ్గించవచ్చు. మేం చెబితే మాత్రం జిలేబీలు తినడం మానడం లేదు" అని దువా ఆ వీడియోలో హాస్యభరితంగా కోరారు. ఈ రీల్‌కు ప్రధాని మోదీ స్పందించారు. దువా రీల్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ, "నేను ఆయన తండ్రినే కాదు, ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. చక్కెర వాడకాన్ని తగ్గించుకోండి, ఆరోగ్యంగా ఉండండి, సంతోషంగా జీవించండి!" అని సందేశం రాశారు. దీనితో పాటు, అధిక చక్కెర వినియోగం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, ఊబకాయం ముప్పు గురించి వివరిస్తూ ఓ గ్రాఫిక్‌ను కూడా పంచుకున్నారు. ఫిట్‌గా ఉండేందుకు యోగా చేయాలని సూచించారు. యువతకు సంబంధించిన అంశాలపై ఢిల్లీ కేంద్రంగా యువరాజ్ దువా చేసే కంటెంట్ సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది. తాజాగా ప్రధాని మోదీ ఆయన విజ్ఞప్తికి స్పందించిన తీరు, ఆరోగ్య సందేశం ఇవ్వడంపై నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# బడ్జెట్ ప్రసంగంను వాకౌట్ చేసిన బిఆర్ ఎస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్**దశుక్రవారం నాడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బహిష్కరించి సభనుంచి వాక్ ఔట్ చేసారు. చెవిలో పూలు పెట్టుకొని వాకౌట్ చేసారు. బిఆర్ ఎస్ సభ్యుల ఆందోళనతో శాసన సభ ప్రాంగణం దద్దరిల్లింది. తులం బంగారం మోసం మోసం అంటూ నినాదాలు చేసారు. రెండు లక్షల ఉద్యోగాలు మోసం మోసం. బడ్జెట్ మోసం మోసం అంటూ నినాదాలు చేస్తూ శాసన సభ ఎంట్రీ వద్ద ధర్నా కు దిగారు.

# రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లపై అదనపు ఎస్పీ పరిశీలన

**మహబూబ్నగర్** శుక్రవారం మహబూబ్నగర్ పట్టణంలోని ఇద్గా వక్ఫ్-ఎ-రహ్మానియా వద్ద అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం బందోబస్తు ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించబడనున్న ఈద్ ఉల్ ఫితర్ నమాజ్కు భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా మరియు ట్రాఫిక్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి మరియు ఇతర సిబ్బందికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ఇద్గా పరిసర ప్రాంతాలలో కట్టుదిట్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ నిర్వహణ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# కేవలం రూ.2,03,000 కోట్లు మాత్రమే ఆదాయం

## - ఎమ్మెల్సీ దాసోజు

**హైదరాబాద్** 2025?26 ఆర్థిక సంవత్సరంలో రూ.2,29,720 కోట్ల రెవెన్యూ సంపాదిస్తామని గత బడ్జెట్లో ఈ ప్రభుత్వం చెప్పింది. కానీ కేవలం రూ.2,03,000 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చిందని ఈ బడ్జెట్లో పేర్కొన్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు.

కాగ్ నివేదిక ప్రకారం జనవరి 2026 వరకు ప్రభుత్వం యొక్క రెవెన్యూ ఆదాయం కేవలం రూ.1,38,371 కోట్లు మాత్రమే. కానీ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.2,03,000 కోట్లు సాధించాలంటే, జనవరి 2026 నుండి ఇప్పటివరకు అంటే 50 రోజుల్లో రూ.65 వేల కోట్ల రెవెన్యూ రిసెప్ట్స్ వచ్చాయా? ఇదెలా సాధ్యమని అయన ప్రశ్నించారు.

# బీకే గూడలో ఎమ్మెల్యే తలసాని పర్యటన

**సికింద్రాబాద్** ఆకలితో అలమటిస్తున్న అనేకమంది పేదల ఆకలి తీర్చడం ఎంతో గొప్ప పుణ్య కార్యమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సనత్ నగర్ లోని బికె గూడ పార్క్ వద్ద శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పంపిణీ, చలివేంద్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2011 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం వేసవి కాలంలో సుమారు 70 రోజుల పాటు ఎంతో రుచికరమైన భోజనాన్ని పేదలకు అందిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా తమ వయసును సైతం లెక్కచేయకుండా సమాజానికి సేవ చేయాలనే లక్ష్యాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రంలో అనేకమంది సీనియర్ సిటిజన్ లు ఉన్నప్పటికీ సనత్ నగర్ లోని సీనియర్ సిటిజన్ లు తమ సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారని అన్నారు. కుటుంబ సభ్యులతో గడపాల్సిన సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప సంకల్పం అన్నారు. ఇక్కడ భోజనం తిని ఆకలి తీర్చుకుంటున్న పేదలు తమ జీవితాంతం గుర్తు పెట్టుకుంటారని చెప్పారు.

**జీవితాంతం నా గుండెల్లో ఉంటారు..**తమ సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న సీనియర్ సిటిజన్ లు జీవితాంతం నా గుండెల్లో ఉంటారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వయసులో నా కంటే పెద్ద వారు మీ ఆశీస్సులు నాపై ఉండాలని కోరారు. తనను కలవడానికి వచ్చినప్పుడు శాలువాల కోసం డబ్బు వృధా చేయవద్దని అన్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆరోగ్య రీత్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# గ్యాస్ కోసం ఎదురుచూపులు

**అనకాపల్లి** అనకాపల్లి జిల్లాలో గ్యాస్ సిలిండర్ కోసం ప్రజల అవస్థలు అంతా ఇంతా కాదు . చోడవరం, రావికమతం మండలంలో గ్యాస్ కోసం ఎండలో కష్టాలు జనాలు పడుతున్నారు. సుమారు 500 మీటర్లు దూరం వరకు క్యూలైన్లో పడిగాపులు కాస్తున్నారు.

# కేతపల్లి మండలంలో మట్టి మాఫియా కార్యకలాపాలు

**నల్గొండ** నల్లగొండ జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. నిబంధనలను తుంగలో తొక్కి.. అనుమతులు లేకపోయినా అక్రమార్కులు భూమాత గర్భాన్ని చీల్చేస్తున్నారు.కేతపల్లి మండలం కొండకింది గూడెం గ్రామం ఇప్పుడు అక్రమ మట్టి మైనింగ్కు అడ్డాగా మారింది. జెసిబిలతో మట్టిని తవ్వుతూ, టిప్పర్లతో నకిరేకల్ ప్రాంతానికి తరలిస్తూ దళారులు కాసుల కక్కుర్తి పడుతున్నారు.

అయితే, ఈ అక్రమాలను ప్రశ్నించిన స్థానికులపై గద్దపాటి సైదులు అనే వ్యక్తి దాడులకు తెగబడుతుండటం ఇప్పుడు కలకలం రేపుతోంది. అక్రమ మైనింగ్ వద్దకు ఎవరైనా వెళ్తే చంపేస్తామంటూ బెదిరించడమే కాకుండా, నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద గొయ్యిలు తీసి పర్యావరణానికి ముప్పు తెస్తున్నా.. అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ మరియు పోలీస్ యంత్రాంగం స్పందించి, కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ మట్టి దందాపై అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి.

## ఉప్పల్ నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెడతా మందకృష్ణ మాదిగ



నాచారం (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నియోజవర్గ కేంద్రంగా పలు డివిజన్లో ఉన్న మాదిగల సమస్యలను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పంగా ప్రణయ్ కుమార్ మాదిగ, సీనియర్ నాయకులు ఎమ్మార్పీఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి కూరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రధానంగా మల్లాపూర్ ఎన్టీఆర్ నగర్ డివిజన్లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటుకి వస్తున్న ఆటంకాలు ఉప్పల్ నియోజకవర్గంలో రాజకీయపరంగా మాదిగలో ప్రతినిత్యం పార్టీలు ప్రవర్తిస్తున్న తీరు ఇలా అనేక అంశాలు మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్లరు. ప్రత్యేకంగా ఉప్పల్ నియోజకవర్గం సమయం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎల్లా సంతోష్, ప్రెసిడెంట్ రమేష్, జనరల్ సెక్రటరీ సోములు, యాదగిరి, అజయ్, క్రాంతి, జానీ, దయానంద్ పలు డివిజన్లో మాదిగలు పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం మాదిగల సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎలా కాణివరం మేమంతో అందరం ముందుకుండి నడిపిస్తామని హామీ ఇచ్చారు.

## లాలా పేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం




తార్నాక(ప్రశ్న న్యూస్) లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని పంచాంగ శ్రవణ కార్యక్రమం లాలాపేట్ తక్షశిల స్కూల్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండితులు కృష్ణ చైతన్య శర్మ పంచాంగ శ్రవణాన్ని వినిపించి, నూతన సంవత్సరానికి సంబంధించిన ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు పంచాంగ శ్రవణ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాశ్వత గౌరవ అధ్యక్షుడు నేతి రాములు గుప్తా, అధ్యక్షుడు మడిపడగా శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. సంఘ నాయకులు కాపర్తి ఇంద్రయ్య, ఇంగు వెంకటేశం, చిదిరే వీరభద్రయ్య, ఎనిశెట్టి కృష్ణ, లక్ష్మణ్, సూర్యనారాయణ, నీల రమేష్, తోపాటు సంఘ సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పలాసలో పార్టీ బలోపేతమే లక్ష్యం

**- యార్లగడ్డ వెంకన్న చౌదరి**

**కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని ఉద్ఘాటన**

**పలాస అభివృద్ధికి కేంద్రం, రాష్ట్రం సంపూర్ణ సహకారం**

**- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**



పలాస (ప్రశ్న న్యూస్) పార్టీకి క్షేత్రస్థాయి కార్యకర్తలే పార్టీ కి వెన్నెముక అని, వారి సమన్వయంతోనే భవిష్యత్ విజయాలు సాధ్యమవుతాయని పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. ఈరోజు స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. శ్వెకన్న చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వ సంక్షేమ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. బూత్ స్థాయి నుండి మనమంతా ఒకే కుటుంబంలా కలిసికట్టుగా పనిచేసి, పార్టీని మరింత పటిష్టం చేయాలి," అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకొని, వారికి అండగా నిలవాలని ఆయన సూచించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ఇలాంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని, రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# నాడు పాదయాత్రలో మాట.. నేడు జాబ్ క్యాలెండర్‌తో బాట

**మంత్రి కొలుసు పార్థసారథి**



మంగళగిరి (ప్రశ్న న్యూస్) వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు మతం అన్నా, పండుగ అన్నా కేవలం ఒక రాజకీయ ప్రకటన మాత్రమేనని గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తీవ్రంగా విమర్శించారు. సాక్షి పత్రికలో వారు ఇచ్చే ప్రకటనలు చూస్తుంటే, వారికి ప్రజల క్షేమం కంటే జగన్మోహన్ రెడ్డి క్షేమమే ముఖ్యమని స్పష్టమవుతోందని ఆయన మండిపడ్డారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకమంతా బాగుండాలని కోరుకోవడం హిందూ ధర్మం. కానీ, వైసీపీ నాయకులకు మాత్రం జగన్మోహన్ రెడ్డి బాగుంటే చాలు, ప్రజలు ఏమైపోయినా పర్వాలేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గత ఐదేళ్లలో హిందూ మనోభావాలు దెబ్బతిన్నట్లుగా ఎప్పుడూ జరగలేదని ఆయన గుర్తు చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోకి చెప్పులతో వెళ్లడం నుంచి మొదలుకొని, తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం వరకు వైసీపీ చేసిన పాపాలు ప్రపంచవ్యాప్త హిందువుల మనోభావాలను గాయపరిచాయి. ఇంటి పక్కనే ఆలయాలు ఉన్నా వెళ్లని జగన్ , పండుగ వస్తే మాత్రం ఇంట్లోనే 'డ్రామా సెట్టింగ్‌లు' వేసి ఫోటోలకు పోజులిస్తారు. సంక్రాంతి, ఉగాది పండుగలను కేవలం ప్రచారం కోసం వాడుకుంటున్నారు తప్ప, సంప్రదాయం పట్ల గౌరవం లేదు. అబ్దుల్ కలాం వంటి మహనీయులే హిందూ ధర్మ నియమాలను గౌరవించి డిక్లరేషన్ ఇచ్చి దర్శనం చేసుకుంటే, జగన్ మోహన్ రెడ్డికి ఆ నిబంధనలు పాటించే సంస్కారం ఎందుకు లేదని మంత్రి ప్రశ్నించారు. అమ్మ ఒడి, విద్యా దీవెన అని పేర్లు చెప్పుకున్న వైసీపీ, చదువు పూర్తి చేసుకున్న లక్షలాది మంది ఇంజనీర్లకు, గ్రాడ్యుయేట్లకు ఒక్కటంటే ఒక్క ఉద్యోగ అవకాశం కల్పించలేదు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారు. వైసీపీ పాలనలో నిరుద్యోగంతో అల్లాడిన యువతకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే కొండంత అండగా నిలిచిందని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి విమర్శించారు.

# జాబ్ క్యాలెండర్‌పై హర్షం వ్యక్తం చేసిన నియోజకవర్గ తెలుగుయువత

**కూటమి పాలనలోనే నిరుద్యోగులకు భరోసా**

**యువతకు ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్**

**20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**జాబ్ క్యాలెండర్‌లో విద్య, పోలీస్ శాఖలకు అధిక ప్రాధాన్యత**

**20 నెలల్లోనే 6 లక్షల 28 వేల ఉద్యోగాలు కల్పన**

**నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు బోగి వినోద్**



మంగళగిరి (ప్రశ్న న్యూస్) కూటమి 20 నెలల పాలనలో 6 లక్షల 28 వేల ఉద్యోగాలు కల్పించినట్లు మంగళగిరి నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు బోగి వినోద్ తెలిపారు. టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెంటర్ పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నారా నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జాబ్ క్యాలెండర్‌లో విద్య, పోలీస్ శాఖలకు ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని, మరోసారి డీఎస్సీతో పాటు జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం సుమారు 3,000 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి వివిధ విశ్వవిద్యాలయాల్లో 1,500 అధ్యాపక పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే గ్రూప్--1, గ్రూప్--2 కింద దాదాపు 600 పోస్టులు, 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ కేవలం ప్రకటన కాదు, నిరుద్యోగులకు భరోసా అని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు గందరగోళం లేకుండా ప్రణాళికాబద్ధంగా సిద్ధమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఎంఎస్ఎంఈలు, జాబ్ ఫెయిర్లు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటక రంగాల ద్వారా లక్షలాది ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గుద్దంటి నాగేశ్వరరావు, తెలుగు యువత నాయకులు మేకల సుధీర్, గంట దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవు రోజుల్లోను పనిచేయనున్న జిఎంసి క్యాష్ కౌంటర్లు

**- కమిషనర్ మయూర్ అశోక్**




గుంటూరు (ప్రశ్న న్యూస్) 2025--26 ఆర్థిక సంవత్సరము ఆస్తి పన్ను, బకాయిలను చెల్లించుటకు వీలుగా, శనివారం (రంజాన్ పండుగ), ఆదివారం శెలవు రోజులైనప్పటికీ కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో పన్ను చెల్లింపు కేంద్రాలు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు యధావిధిగా పనిచేస్తాయని, బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏక మొత్తంగా చెల్లించే ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ప్రకటించిందని, నగర ప్రజలు ఆస్తి, ఖాళీ స్థల పన్నులు నీటి పన్నులు పూర్తిగా చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా సెలవు రోజులైనప్పటికీ జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్లలో నగర పాలక సంస్థకు చెల్లించవలసిన పన్ను చెల్లించవచ్చున్నారు.

## అకాల వర్షాలతో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలించిన కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

**బద్వేలు** బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు మండలాల్లో విస్తృతంగా పండ్ల తోటలు సాగు చేయబడుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో అరటి పంట ప్రధానంగా సాగు అవుతోంది. నిన్న రాత్రి కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రైతులకు చేతికి వచ్చిన అరటి పంట తీవ్రంగా దెబ్బతిన్నది

.ఈ నేపథ్యంలో కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం కాశినాయన మండలం సావిశెట్టిపల్లె గ్రామాన్ని సందర్శించి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి. బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఉద్యాన శాఖ మరియు వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

.ఇటుకలపాడు సహా సమీప గ్రామాల్లో కూడా పంట నష్టం జరిగినట్లు స్థానికులు తెలియజేయగా, ఆ విషయాన్ని ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ గమనించారు. ఈ మూడు మండలాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో అరటి సాగు జరుగుతుందని, ఇది రైతుల ప్రధాన ఆదాయ వనరుగా ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే రైతులకు మరింత ఉపయోగంగా ఉంటుందని దాని ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) పట్టణం నందు ముస్లిం సోదరులకు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ విచ్చేసి ముస్లిం సోదర సోదరీమణులను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి స్వయంగా ఇఫ్తార్ విందు వడ్డించినారు ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ముస్లింల ఆర్థిక సామాజిక అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నాడని 20 నెలల పాలనలో ఇమామ్ మౌజమ్ లకు మూడు విడతల్లో 180 కోట్లు గౌరవ వేతనం అందించాడని బడ్జెట్లో ముస్లిములకు 6090 కోట్లు కేటాయించాడని గత వైయస్సార్సీపి ప్రభుత్వంలో ముస్లింల ఆస్తులు కబ్జా చేశారని సంక్షేమ పథకాలను నిలిపివేశారని తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉర్దూ అకాడమీని అభివృద్ధి చేశారని విదేశీ విద్య, పెన్షన్లు, తల్లికి వందనం ద్వారా ముస్లింల కుటుంబాలకు అండగా ఉందని అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గమునందు కీర్తిశేషులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఈద్గాలకు షాది మహల్ లకు వందల కోట్ల విలువ చేసే భూములు ఇచ్చారని అలాగే వారి అభివృద్ధికి పనిచేశాడని అలాగే వారి తనయుడు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఈద్గాలను, షాదీ మహలను తన సొంత నిధులతో బాగు చేశారని ప్రతి సంవత్సరం వేల మందికి ఇఫ్తార్ విందు ఇస్తున్నాడని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ టిడిపి అధ్యక్షులు జి విజయ్ కుమార్ తెలుగుదేశం పార్టీ ముస్లిం సోదరులు కూటమి నాయకులు ముస్లిం సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కొల్చారం మండల ముస్లిం సోదరులకు
# రంజాన్ పండుగ శుభాకాంక్షలు

**ఎండి యూనస్ ఖాన్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల ముస్లిం సోదరులకు పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఎండి యూనస్ ఖాన్ మాట్లాడుతూ ఈ పవిత్ర మాసం మనుషుల మధ్య సౌహార్దం, సహనం, సేవాభావం, దాతృత్వం వంటి గొప్ప విలువలను పెంపొందించే పవిత్ర కాలమని వారు పేర్కొన్నారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు మనిషిలో ఆత్మ నియంత్రణను పెంపొందించడమే కాకుండా, సమాజంలో సమానత్వ భావనను బలపరుస్తాయని అన్నారు. పేదవారికి సహాయం చేయడం, పరస్పరం ప్రేమాభిమానాలు పెంచుకోవడం ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని వారు ఆకాంక్షించారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఇంటిలో ఆనందం, ఆరోగ్యం, శాంతి నింపాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని ఎండి యునాస్ ఖాన్ ప్రార్థించారు. కొల్చారం మండల ముస్లిం సోదరులు ఐకమత్యంతో ముందుకు నడవాలని వారు కోరారు.

# బూరుగుపల్లిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**- ఎమ్మెల్యే సత్యం నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా దూసుకెళ్తుంది**

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామంలోని 8వ వార్డు మహారాజుల కాలనీలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య-మహేష్, ఉపసర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొలుపుల ప్రవీణ్,వార్డు సభ్యులు అతికం రాజశేఖర్ గౌడ్,కొలుపుల మల్లేశం,బరిగే రమేష్,అక్కరాజు తిరుపతి, కల్లేపల్లి మమత తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతూ, ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సీఆర్ఆర్(ప్రత్యేక అభివృద్ధి నిధులు )నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే సత్యం నాయకత్వంలో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రజా ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

## ఆదర్శ గ్రామం దిశగా
# రామన్నపేట సర్పంచ్ కవిత - వెంకట్ రెడ్డి

**- గ్రామాభివృద్ధే లక్ష్యం - ప్రజల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం**

**- రామన్నపేట సర్పంచ్ : చింతలపల్లి కవిత - వెంకట్ రెడ్డి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, రామన్నపేట గామంలో అభివృద్ధి దిశగా శరవేగంగా పనులు కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ చింతలపల్లి కవిత - వెంకట్ రెడ్డి గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కంకణబద్ధులై పలు మౌళిక సదుపాయాల పనులను ముమ్మరం చేశారు. గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయించడం, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడం, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయం మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గ్రామస్తులకు మౌళిక సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత - వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రామ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడం మా బాధ్యత. రామన్నపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం తప్పనిసరి. ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని అన్నారు. పలువురు గ్రామస్తులు సర్పంచ్ కృషిని ప్రశంసిస్తూ, "గ్రామంలో ఎన్నాళ్లుగానో పెండింగ్లో ఉన్న పనులు ఇప్పుడు వేగంగా పూర్తవుతున్నాయి. లైట్లు, డ్రైనేజీల పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు మెరుగుపడటంతో మాకు ఎంతో ఉపశమనం కలిగింది. సర్పంచ్ గ్రామ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని కొనియాడారు.గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో రామన్నపేట గ్రామం ముందుకు సాగుతోందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థినుల భద్రతకు షీ టీమ్ చైతన్యం

**- వేధింపులపై వెంటనే ఫిర్యాదు చేయాలని సూచన**



వేములవాడ (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళల భద్రతపై షీ టీమ్ బృందం విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మార్గదర్శకత్వంలో విద్యాసంస్థలు, మహిళలు పని చేసే ప్రదేశాల్లో నిరంతరం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, మహిళా హక్కులు వంటి అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే స్పందించాలని, బాధితులు ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు.వేములవాడ రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన బృందం, విద్యార్థినులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకుంది. ఎవరైనా ఇబ్బందులకు గురైతే షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫోన్ చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని,అపరిచితులతో చాట్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, రవి, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మోండా డివిజన్ లో
# రహదారి పనులు ప్రారంభం: ఎమ్మెల్యే.



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మోండా డివిజన్ లో 48 లక్షల రూపాయలతో నూతన సిమెంట్ రహదారి పనులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న శుక్రవారం ఉదయం ప్రారంభించారు.మోండా డివిజన్ పరిధిలోని సికింద్రాబాద్ క్లాక్ టవర్ ఏరియాలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ నుంచి ఆయుష్ కార్యాలయం వరకు వేయనున్న సిమెంట్ రహదారి పనులను ఎమ్మెల్యే, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా డివిజన్ లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేయించి ఎక్కడ అవసరమో అక్కడ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. మోండా డివిజన్ ను ఆదర్శవంతంగా తిర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం, అధికార యంత్రాంగం పని చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఢాకు నాయక్, డిప్యూటీ ఇంజినీర్ దీపిక, అసిస్టెంట్ ఇంజనీర్ వరుణ్ దేవ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేష్ యాదవ్,సంతోష్ యాదవ్,బద్రీనాథ్ యాదవ్, వైష్ణవి యాదవ్,టెంపుల్ కమిటీ చైర్మన్ లు అరవింద్ యాదవ్,గౌరీ శంకర్, వెంకట్రాజు,శేఖర్ ముదిరాజ్, నందికంటి రవి,బాబూరావు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న శుక్రవారం పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదలైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను నియోజకవర్గంలోని 62 కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు వైద్య సహాయానికి సంబంధించి మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సర్కార్ సహాయం పొందుతున్న కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చెక్కులను పొందిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో పేద ప్రజలకు వైద్య సహాయం అందజేయడం కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతగా భావించి, ప్రభుత్వ వైద్యశాలల్లో మేరుగైనా వైద్యం వైద్యులు ద్వారా చికిత్స పోందాలనీ కార్పోరేట్ హాస్పిటల్స్ కు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన అనంతరం తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ పై
# అనుముల భాస్కర్ ఫైర్

**- భారీ అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**

**- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నేత, నీలోజిపల్లి సర్పంచ్ : అనుముల భాస్కర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, ఈ బడ్జెట్ రైతులు, దళితులు సహా అన్ని వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు కాలేదని, అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న భారీ అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సూచించారు.

## వార్డు సభ్యుల సంక్షేమంపై
# రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి

**- వార్డు సభ్యులకు గౌరవ వేతనం, బీమా పథకాలు కల్పించాలి**

**- తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు :అతికం రాజశేఖర్ గౌడ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గౌరవ వేతనం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.బోయినిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలందిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న వార్డు సభ్యులను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వారి సేవలకు ప్రతిఫలంగా గౌరవ వేతనం ఇవ్వడం అత్యవసరమని పేర్కొన్నారు. అలాగే వార్డు సభ్యుల భద్రత దృష్ట్యా ప్రత్యేక ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పించాలని, ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలని సూచించారు. వార్డు సభ్యుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బత్తిని అనిల్, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్కాజిగిరి ఎం.పి
# ఈటెల రాజేంద్ర పుట్టినరోజు వేడుకలు



కాప్రా (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని పెద్ద మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గంకు ప్రాతినిత్యం వహిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ డిసి మెంబర్ సంగిశెట్టి రవీంద్రసాగర్ శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ డిసి మెంబర్ సంగిశెట్టి రవీంద్రసాగర్ మాట్లాడుతూ భారతదేశం తెలంగాణ రాష్ట్రంలో పెద్ద పార్లమెంట్ నియోజకవర్గం అయినా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తూ, కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధులను తెలంగాణకు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం మంత్రులతో మాట్లాడి, పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ గురించి తన నియోజకవర్గమైన మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం గురించి జరుగవలసిన అభివృద్ధి గురించి పార్లమెంట్లో గలమెత్తి మాట్లాడి రాష్ట్రానికి నియోజకవర్గానికి నిధులు రావడంలో ఎంపీ ఈటెల రాజేందర్ కృషి ఎంతో ఉందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇస్తున్న ఇచ్చిన నిధులతో పేర్లు మార్చి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పబ్బం గడుపుతున్నారు తప్ప ప్రజలకు సేవ చేసే దృక్పథం లేదని ప్రజలు కాంగ్రెస్ పార్టీ పాలనను ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులను చూసి సిగ్గుపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి మొత్తం కుంటుపడిందని అభివృద్ధి చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. గతంలో తెలంగాణలో బిజెపి పార్టీకి తప్ప అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారని రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో బిజెపికి ఒక అవకాశం ఇవ్వాలని, అనంతరం అభివృద్ధి ఏ విధంగా సాగుతుందో ప్రజలు మాటలు చెప్పుకోవడం కాదు చేతలు చేసే ప్రభుత్వమని ఒకరికొకరు చెప్పుకునేలా బిజెపి ప్రభుత్వం ఆ దిశగా అభివృద్ధి ఉంటుందని ఆయన అన్నారు. తెలంగాణ సపరేటు రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వానికి రెండుసార్లు, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒకసారి అవకాశం ప్రజలు ఇచ్చారని అయినా ప్రజలలో ఇంకా అసంతృప్తి నెలకొందని రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు పట్టుదలతో కృషి చేసి బిజెపి ప్రభుత్వం ఏర్పడేందుకు తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ శక్తి సాయి నగర్ డివిజన్ మహిళ అధ్యక్షురాలు సబిత యాదవ్, డివిజన్ సెక్రెటరీ పుణ్యవతి బూత్ ప్రెసిడెంట్, లింగం గౌడ్, ఆనంద్, నరేష్, మధు, అంజి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి నాయకత్వంలో
# సమగ్రమైన రాష్ట్ర బడ్జెట్

**- ఆమోదయోగ్యమైన రాష్ట్ర బడ్జెట్**

**- బోయినిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సమగ్రంగా రూపొందించబడిందని బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అన్నారు. ఈ బడ్జెట్ రైతులు, కార్మికులు, మహిళలు, యువత సహా ప్రతి వర్గానికి మేలు చేసే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించిన నిధులు, వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత ప్రశంసనీయమని తెలిపారు. మార్కెట్ యార్డుల అభివృద్ధి, పంటలకు సరైన ధరలు కల్పించే చర్యలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఆయన ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం దూరదృష్టితో తీసుకొచ్చిన బడ్జెట్ ఇదని పేర్కొన్నారు. అలాగే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషిని కొనియాడుతూ, తన నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు.విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలకు కూడా సముచిత ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఈ బడ్జెట్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని బోయిని ఎల్లేష్ యాదవ్ అన్నారు.

# కంటెంట్ చూసి ఆశ్చర్యపోతున్నారు

'మొదటి షో నుంచే అన్ని ప్రాంతాల నుంచి పాజిటివ్ టాక్ రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాలో ఇంత కంటెంట్ ఉంటుందని తాము ఊహించలేదంటూ చూసినవారిలో చాలామంది ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ని తీస్తున్నాననీ, వింటేజ్ పవర్‌స్టార్‌ని చూపించబోతున్నానని ముందునుంచీ చెబుతూ వచ్చాను. చెప్పింది చేసి చూపించాననే ఆత్మసంతృప్తితో ప్రస్తుతం నా హృదయం నిండిపోయింది. ఇప్పటివరకూ చూపించని కొన్ని అంశాలను ఈ మాస్ ఎంటైర్టైనర్‌లో చూపించాం. ఇందులోని ప్రతి పాత్రా ఆడియన్‌కి కనెక్టయింది. సాంకేతికంగా అందరూ ప్రాణం పెట్టారు. 'తొలిప్రేమ' పాట సెకండాఫ్‌లో పెట్టడం ఆడియన్స్‌ని బాగా నచ్చింది. ఇది మా టీమ్ సమిష్టి విజయం' అంటూ ఆనందం వ్యక్తం చేశారు దర్శకుడు హరీశ్‌శంకర్. ఆయన దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మించిన ఈ చిత్రం గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ ప్రెస్‌మీట్‌లో హరీశ్‌శంకర్ మాట్లాడారు. ఆట ఆటకీ వసూళ్లు పెరుగుతున్నాయని, ఇది పవర్‌స్టార్ వన్ మ్యాన్ షో అనీ, కచ్చితంగా భారీ వసూళ్లు ఖాయమని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా కళాదర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ తదితరులు మాట్లాడారు



# పిడికిలి బిగించిన శివరాజ్‌కుమార్..
## 'గుమ్మడి నర్సయ్య' ఉగాది స్పెషల్ లుక్ వైరల్

పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ వేత్తగా, ప్రజా నాయకుడిగా ఎంతో ప్రజాదరణ పొందిన నాయకుడు గుమ్మడి నర్సయ్య. ఎంతోమందికి స్పూర్తిగా నిలిచే ఆయన బయోపిక్ సిల్వర్ స్క్రీన్‌పై సందడి చేసేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి గుమ్మడి నర్సయ్య టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. కన్నడ స్టార్ యాక్టర్ శివరాజ్‌కుమార్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. పరమేశ్ హివ్‌రాలే డైరెక్ట్ చేస్తున్నాడు. తాజాగా మేకర్స్ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. తాజా పోస్టర్‌లో శివన్న ఎర్ర జెండాల మధ్య పిడికిలి బిగించి కనిపిస్తున్నాడు. దృఢ సంకల్పం, మండుతున్న కళ్లు, దశాబ్దాల ప్రజల పోరాటాలను ప్రతిధ్వనించే ఎర్ర జెండాల సముద్రం అంటూ షేర్ చేసిన నయా లుక్ సినిమాపై అంచనాలు మరింత పెంచేస్తుంది. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్‌లో శివన్నతెలుగు రంగు చొక్కా, ధోతిలో భుజాన ఎర్ర కండువా వేసుకుని సైకిల్‌ను తోసుకుంటూ వెళ్తుండటం చూడొచ్చు. సైకిల్ హ్యాండిల్‌కు సీపీఐఎంఎల్ జెండాను గమనించవచ్చు. అసెంబ్లీ ముందు నుంచి మిగిలిప ప్రజాప్రతినిధులంతా బుగ్గ కార్లలో వస్తుంటే.. గుమ్మడి నర్సయ్య మాత్రం సాదాసీదాగా సామాన్య వ్యక్తిలా సైకిల్‌తో వెళ్తుంటాడు.గుమ్మడి నర్సయ్య పేరునే టైటిల్‌గా ఫిక్స్ చేసి మొదటి ప్రయత్నంలోనే అందరి ఫోకస్ తనవైపునకు తిప్పుకుంటున్నాడు డైరెక్టర్. ఈ చిత్రాన్ని ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎన్ సురేశ్ రెడ్డి నిర్మిస్తుండగా.. సురేశ్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నాడు. చిరు గొడవలు, లావణ్య విత్ లవ్ బాయ్స్ సినిమాల్లో నటించిన పరమేశ్ హివ్‌రాలే ఈ మూవీతో డైరెక్టర్‌గా మారుతుండటంతో క్యూరియాసిటీ పెరిగిపోతుంది.




# అది బ్రేకింగ్ న్యూస్ కాదు!

అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ఓ వ్యాపారవేత్తతో పెళ్లిపీటలెక్కబోతున్నదని గత కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో వార్తలొస్తున్నాయి. తాజాగా వీటిని ఆమె వ్యక్తిగత టీమ్ ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఒకరి వ్యక్తిగత జీవితం గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించింది. 'అనుష్క శెట్టి వయసుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వార్తల్ని ప్రచారం చేస్తున్నారు. మరి హీరోల వయసు విషయంలో మీలో ఆ ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు?' అని ప్రశ్నించింది. 'తన వ్యక్తిగత జీవితం విషయంలో అనుష్క గోప్యతను పాటిస్తుంది. పెళ్లి అనేది వ్యక్తిగత విషయం. అది బ్రేకింగ్ న్యూస్ ఎంత మాత్రం కాదు. వార్తల్ని ప్రచురించే ముందు నిజానిజాలేమిటో తెలుసుకోం డి' అంటూ అనుష్క టీమ్ పేర్కొన్నది.




### సామాజిక సందేశంతో
# 'కరుప్పు'



సూర్య ద్విపాత్రాభినయంలో నటిస్తున్న చిత్రం 'కరుప్పు'. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్నది. మే 14న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కోర్ట్ రూమ్ డ్రామాలో సూర్య లాయర్ పాత్రలో కనిపించనున్నారు. సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్ కలబోతగా సాగే యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిదని, కథలోని సామాజిక సందేశం ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. త్రిష, ఇంద్రన్, నట్టి, స్వాసిక తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాయి అభ్యంకర్, నిర్మాతలు: ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, రచన-దర్శకత్వం: ఆర్జే బాలాజీ.


### 11 ఏళ్ల తర్వాత వెండితెరపైకి
# 'ప్రేమదేశం' హీరో..
## - ఆకట్టుకుంటున్న 'హ్యాపీ రాజ్' ట్రైలర్




90వ దశకంలో తన స్టైల్ మరియు నవ్వుతో కుర్రకారును ఉర్రూతలూగించిన లవర్ బాయ్ అబ్బాస్ మళ్లీ కెమెరా ముందుకు వచ్చాడు. సుమారు 11 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన వెండితెరపై కనిపించబోతున్నారు.

జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న 'హ్యాపీ రాజ్' (ఝుజూజూం ఝుయ) చిత్రంతో ఆయన తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ చిత్ర తెలుగు ట్రైలర్ ఇప్పుడు సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో అబ్బాస్ పాత్ర చాలా కీలకంగా ఉండబోతోంది. హీరోయిన్‌గా తెలుగు నటి శ్రీ గౌరీ ప్రియ నటిస్తుండగా.. ఆమె తండ్రిగా, అమెరికాలో నివసించే 'రాజీవ్' అనే ఎన్నారై పాత్రలో అబ్బాస్ కనిపించబోతున్నాడు. ట్రైలర్‌లో ఆయన లుక్ చూస్తుంటే, ఒకప్పటి 'మిన్నలే' (తెలుగులో 'చెలి') సినిమాలోని అబ్బాస్‌ను గుర్తుకు తెచ్చేలా స్టైలిష్‌గా ఉండటం విశేషం. రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఇదొక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ మరియు రొమాంటిక్ కామెడీగా రాబోతుంది. పెళ్లి పీటల వరకు వెళ్లాలనుకునే ఒక జంటకు, వారి కుటుంబాల మధ్య ఎదురయ్యే సరదా సంఘటనలు, ఎమోషన్స్‌తో ఈ సినిమా రూపొందింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేస్తోంది.

## క్రికెట్, క్రైమ్, పాతబస్తీ.. ఇంట్రెస్టింగ్‌గా సుధీర్ బాబు 'గల్లీ' ఫస్ట్ లుక్




టాలెంటెడ్ హీరో సుధీర్ బాబు డిజిటల్ ఎంట్రీ ఇస్తూ నటిస్తున్న సరికొత్త వెబ్ సిరీస్ 'గల్లీ' అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా రాబోతున్న ఈ సిరీస్‌ను ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తుండగా 'బాహుబలి' వంటి భారీ చిత్రాలను నిర్మించిన ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. హైదరాబాద్‌లోని పాతబస్తీ గల్లీల నేపథ్యంలో ఒక 'మోడరన్-డే వెస్ట్రన్' డ్రామాగా ఈ కథను రూపొందించారు. ఒక హై-స్టేక్స్ గల్లీ క్రికెట్ మ్యాచ్ జరగడానికి ముందు రోజు రాత్రి చోటుచేసుకునే ఉత్కంఠభరిత పరిణామాలు, నేరస్థులు, పోలీసులు మరియు ఆటగాళ్ల మధ్య సాగే దోబూచులాట ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణ. ఇందులో సుధీర్ బాబు మునుపెన్నడూ చూడని విధంగా చాలా రఫ్ అండ్ మాస్ లుక్‌లో కనిపించబోతున్నారు. ఆయనతో పాటు సీనియర్ నటుడు జె.డి. చక్రవర్తి, హన్సిక మోట్వానీ, శ్రద్ధా శ్రీనాథ్, ఆదర్శ్ బాలకృష్ణ వంటి భారీ తారాగణం ఈ సిరీస్‌లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. క్రికెట్ వెనుక ఉన్న గ్యాంగ్‌స్టర్ డ్రామాను ప్రవీణ్ సత్తారు తనదైన శైలిలో ఆవిష్కరిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ త్వరలోనే స్ట్రీమింగ్ కాబోతుంది.

# ఆది సాయికుమార్ కోలీవుడ్ ఎంట్రీ..
## - 'ఈగో రాజా' ఉగాది స్పెషల్ లుక్



శంబాల సక్సెస్‌తో ఫుల్ జోష్ మీదున్నాడు టాలీవుడ్ యంగ్ యాక్టర్ ఆది సాయికుమార్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన ఆదిసాయికుమార్ గురు శరవణన్ డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈగో రాజా (జుస్త్రశీ ఝుయిఝు)టైటిల్‌తో వస్తోన్న ఈ మూవీని ఎస్‌జీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జీ సురేశ్ నిర్మిస్తున్నారు. ఆది సాయికుమార్ తమిళ్ డెబ్యూ సినిమాగా వస్తోన్న ఈగో రాజా తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ కొత్త లుక్ విడుదల చేశారు. ఆదిసాయికుమార్ చుట్టూ రౌడీలు, ఒంటిపై గాయాలు, రక్తపు మరకలు చూస్తుంటే హై ఓల్టేజీ యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఆది నిప్పు రాజేసేలా యాక్షన్ అవతార్‌లో ఇప్పటివరకు లేని విధంగా సిగరెట్ కాలుస్తూ అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ఆదిలో ఇదివరకెన్నడూ చూడని డైమెన్షన్‌ను చూడబోతున్నారని తాజా లుక్‌తో హింట్ ఇచ్చేస్తున్నారు మేకర్స్. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ కేఎస్ రవికుమార్ దగ్గర పనిచేసిన గురు శరవణన్ డైరెక్షన్‌లో వస్తున్న సినిమా కావడం, బైలింగ్యువల్ ప్రాజెక్టు అవడంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ చిత్రాన్ని గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు. హై ఆక్టేన్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ చిత్రానికి

# సీనియారిటీ ప్రాతిపదికన ఎన్యుమరేటర్ల నియామకం జరుగాలని తహసీల్దార్ కు వినతి

**- ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (టీఎస్)మండలాధ్యక్షులు : ఎరువ రఘునాథ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) జనాభా లెక్కింపు విధుల్లో సీనియర్లకు ప్రాధాన్యం కల్పించాలని పీ.ఆర్.టీ.యూ. టీస్ బోయినిపల్లి మండల అధ్యక్షులు ఎరువ రఘునాథ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం బోయినిపల్లి తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాబోయే గృహ గణన, జనాభా లెక్కింపు కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్ల నియామకంలో సీనియారిటీ ప్రాతిపదికను తప్పనిసరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సోషియో ఎకనామిక్, ఎడ్యుకేషన్,ఎంప్లాయ్మెంట్, పొలిటికల్ అండ్ కాస్ట్ సర్వేలో సేవలు అందించిన ఉపాధ్యాయులకు అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని అవకాశాలు కల్పించాలని,అలాగే, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులను వారి వినతుల మేరకు ఈ విధుల నుండి మినహాయించాలని ఆయన అభ్యర్థించారు.ఈ విషయంపై తహసిల్దార్ తగిన చర్యలు తీసుకోవాలని రఘునాథ్ విజ్ఞప్తి చేశారు.

# క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలి

**కిష్టాపూర్ ప్రీమియం లీగ్ విజేతలకు బహుమతులు అందజేత**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ఉగాది పండుగను పరిష్కరించుకొని కిష్టాపూర్ ప్రీమియం క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న టోర్నమెంట్ నాలుగు జట్టులు ఏర్పడి యువకులు హోరా హోరియా పోటీపడి చివరికి రెండు జట్లు ఎంబరి రాజు యాదవ్ మరియు నాగుల గారు రాజేష్ గౌడ్ ఫైనల్ కి చేరుకొని ఫస్ట్ విజేతగా ఏంబరి రాజు యాదవ్ గెలుపొందగా రెండవ విజేతగా నాగుల గారి రాజేష్ గౌడ్ గెలుపొందారు ఈ ఇరుజట్లను బహుమతులు ప్రధానం చేయడానికి కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య, మరియు మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకట రాములు, మరియు బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, హెడ్ కానిస్టేబుల్ సురేందర్, ఎంబరి శేఖర్ యాదవ్, నాగుల గారి దుర్గా గౌడ్, క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్ ఎండి హుస్సేన్, జర్నలిస్టు నాగరాజు గౌడ్ పాల్గొని గెలుపొందిన ఇరు జట్టులకు ట్రోఫీలను అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిష్టాపూర్ ప్రీమియం లీగ్ లో పాల్గొన్న నాలుగు జట్టులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు ఆటలు గెలుపు ఓటములు సహజమేనని ఆటలో స్నేహభావంతో కలిసి మెలిసి ఆడినందుకు కిష్టాపూర్ యువతకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి కార్యదర్శిగా బుడ్డ భాగ్యరాజ్ నియామకం



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కీలక నియామకం చోటుచేసుకుంది. పార్టీ బలోపేతం లక్ష్యంగా, లయన్ బుడ్డ భాగ్యరాజ్ ను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ పి. మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లయన్ బుడ్డ భాగ్యరాజ్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు,గారికి చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. “మీ ప్రేమే నా బలం – మీతో ఈ బంధమే నా ఊపిరి. మీ అందరి ఆశీస్సులతో మరింత బాధ్యతగా, శక్తివంతంగా పనిచేస్తాను. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను” అని ఆయన స్పష్టం చేశారు.అలాగే జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన-కావీజ మాజీ చైర్మన్ రజనకు, ప్రవీణ్ కుమార్‌కు కూడా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ నియామకం ద్వారా మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు లభిస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సీతమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు బండ్లు ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు వేడుకున్నట్లు ఆయలి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉగాదిని పురస్కరించుకొని మండల పరిధిలోని తుక్కాపూర్ లోని మంజీరా నది తీరాన వెలసిన సీతమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్లే ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆరే రవీందర్, వార్డు సభ్యులు సుధాకర్ ఆయలి నాగయ్య కుమారులు నావాజులు, మల్లయ్య, పత్తి గారి శివకుమార్, ఆరే దత్తురావ్, దొడ్ల శ్రీశైలం,టేక్మాల్ మల్లప్ప, టేక్మాల్ సిద్దప్ప, శ్రీకాంత్,మంగలి దుర్గేష్, చింటూ, ఢిలర్ శంకర్, ఆయలి నాగరాజు, బ్యాగరి దుర్గేష్,మంగలి విష్ణు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు యాదగిరిగుట్ట యువకుల ఉగాది శుభాకాంక్షలు

## లక్ష్మీనరసింహస్వామి ప్రసాదంతో సత్కారం















హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును యాదగిరిగుట్టకు చెందిన యువకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని, ఆయన నివాసంలో భేటీ అయిన యువత. కేసీఆర్‌కు హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. యాదగిరిగుట్ట క్షేత్ర అభివృద్ధికి విశేష కృషి చేసిన నాయకుడిగా ఆయనపై ఉన్న గౌరవంతో ఈ భేటీ జరిగినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య ఆశీస్సులు ఆయనకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, స్వామివారి పవిత్ర లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కేసీఆర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ భేటీలో యువ నాయకులు ఆకుల గిరిబాబు, ఓరిగంటి శివకుమార్, ఎడపల్లి కరుణాకర్, పులేపాక వినయ్ పాల్గొన్నారు. తమ ప్రాంత అభివృద్ధి పట్ల కేసీఆర్ చూపిన చొరవను ఈ సందర్భంగా యువకులు గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ సైతం యువకులను ఆత్మీయంగా పలకరించి, వారికి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆశీర్వదించారు.

# గ్రామాల్లో ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

## మూడు నెలల పాటు కొనసాగనున్న పిరియాడిక్ సర్వే






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి, గుండన్నపల్లి గ్రామాల్లో జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

ఈ సర్వేను కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ చేపట్టారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లో ప్రజల ఉపాధి స్థితిగతులను అంచనా వేసేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదట సాధారణ వివరాలు సేకరించిన అనంతరం, ఎంపిక చేసిన కుటుంబాలపై ట్యాబ్ ద్వారా మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే నిర్వహించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తామని వెల్లడించారు. సర్వేలో భాగంగా కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, వారి విద్యార్హతలు, చదువు మానేసిన స్థాయి, ఉన్నత విద్య, వృత్తి విద్య కోర్సులు, ఉద్యోగం లేదా స్వయం ఉపాధి వివరాలు నమోదు చేశారు. అలాగే రోజువారీ కూలీలైతే వారంలో చేసిన పనులు, పని గంటలు, పొందిన వేతనం వంటి అంశాలను కూడా నమోదు చేశారు. మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నట్లయితే వారి ఆదాయ వివరాలను కూడా సేకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బోయినిపల్లి ఎంపీడీఓ భీమా జయశీల, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, ఎండి జాఫర్ హైమద్, గ్రామ సర్పంచులు బొంగాని అశోక్ గౌడ్, కొప్పుల లావణ్య-నగేష్, ఉప సర్పంచులు చంద్రగిరి అశోక్, చిలువేరి కిషన్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు అక్కెనపల్లి నీలమ్మ, అక్కెనపల్లి భాగ్య, నంది భారతి, ఆశ

# సీతమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు బండ్లు ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

సీతమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు వేడుకున్నట్లు ఆయలి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉగాదిని పురస్కరించుకొని మండల పరిధిలోని తుక్కాపూర్ లోని మంజీరా నది తీరాన వెలసిన సీతమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్లే ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆరే రవీందర్, వార్డు సభ్యులు సుధాకర్ ఆయలి నాగయ్య కుమారులు నావాజులు, మల్లయ్య, పత్తి గారి శివకుమార్, ఆరే దత్తురావ్, దొడ్ల శ్రీశైలం,టేక్మాల్ మల్లప్ప, టేక్మాల్ సిద్దప్ప, శ్రీకాంత్,మంగలి దుర్గేష్, చింటూ, ఢిలర్ శంకర్, ఆయలి నాగరాజు, బ్యాగరి దుర్గేష్,మంగలి విష్ణు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# "తక్ పట్టి" గోల్ మాల్


# లైసెన్స్ దార్ తీన్మార్

- "తక్ పట్టి"మార్కెట్ లో కిరాయి ఇవ్వబడును.?
- చీకట్లో లక్షల్లో వ్యాపారం, తెల్లవారేసరికి తట్ట బుట్ట సర్దేస్తారు మాయగాళ్లు
- బోయిన్ పల్లి మార్కెట్ లో సులభంగా వ్యాపారం, సుంకాలు విధించరు, సగానికి సగం లాభం
- "174"లో సుమారు పదుల సంఖ్యలో "తక్ పట్టి"కిరాయికి ఇస్తున్న పై విజిలెన్స్ కిత్వరలో ఫిర్యాదు:ఇటుక గోపి

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ప్రస్తుతం సమాజంలో పెట్టుబడి లేని వ్యాపారానికే పెద్ద పీఠం వేస్తున్నారు మార్కెట్ జాదుగాళ్ళు.ఏ రంగంలోనైనా వారిదే పైచేయి సాధిస్తున్నారు.రాష్ట్రంలో ఉన్న అరవై నాలుగు శాఖల్లో కొన్ని శాఖల్లో నిత్యం చీకటి కోణంలో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో అన్నింటి కన్నా అసలైన సీసలైన శాఖ "వ్యవసాయ శాఖ"దీంట్లో అధికారులు కార్యాలయానికి వచ్చే సరికి ఆవిరి అయిపోతున్న ఆదాయ మార్గాలు.రాష్ట్రంలోనే కాదు ఆసియాలోనే అతిపెద్ద



మార్కెట్ అయిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో ప్రతి రోజూ ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల్లోపే అసలైన నెంబర్ వన్ కూరగాయలు వ్యాపారం లాభదాయకంగా లావాదేవీలు నిర్వహిస్తున్నారు కేటుగాళ్లు. అసలు బోయిన్ పల్లి మార్కెట్ కి ప్రతి రోజూ పదిహేడు రాష్ట్రాల నుంచి వివిధ రకాల కూరగాయలు దిగుమతితో పాటు, ఇరవై ఏడు టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయని సమాచారం.అలాగే సగటున ప్రతి రోజూ మార్కెట్ కి ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.ముఖ్యంగా ఉదయం 4:30 నుంచి 6:30 లోపే నెంబర్ వన్ కూరగాయలు విక్రయాలు జోరుగా సాగుతోంది.ఈ ప్రక్రియలోనే జాదుగాళ్లు మార్కెట్ లో ఉన్న లైసెన్స్ దారులు నుంచి అంతర్గత ఒప్పందం కుదిరి.ప్రతి నెల కిరాయి ఇరవై ఐదు వేల నుంచి ముప్పై వేల రూపాయలు కేవలం"తక్ పట్టి"ఎంట్రీ కోసం చెల్లించే డబ్బులు.అయితే ఇక్కడే అసలు గుట్టు దాగుంది,ఎంట్రీ ఒక కాడ కూరగాయలు విక్రయాలు మరో చోట.కేవలం గేట్ ఎంట్రీ కోసం చెల్లించే కాసులతో కమీషన్ ఏజెంట్లు లక్షలుకూడగట్టుకుంటున్నారు.ఈ తతంగం అంతా తెల్లవారుజామున (చీకటి కోణంలో జరుగుతున్న ప్రక్రియ) ముఖ్యంగా ముసపేట్ లైన్లో అత్యధికంగా



జరుగుతుండడం,దీనికి సపోర్ట్ మార్కెట్ సూపర్వైజర్లు ఉండడం గమనార్హం!అయితే ఈ పాపంలో సిబ్బందికి కూడా వాట ఉండడం విశేషం.తలా పాపం తిల పిడికిలి అన్నట్టు ఉంది వీరి వ్యవహారం.మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ లో పదుల సంఖ్యలో ఈ తతంగం బాహాటంగా జరుగుతున్న మార్కెట్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అసలు అధికారులు, సిబ్బంది విధ విధానాలు: సిబ్బంది ఉదయం ఐదు గంటలకే మార్కెట్ విధిల్లో,గ్రేడ్ టూ,త్రీ, అడిషనల్ సెక్రటరీ తదితరులు ఆరింటికి విధులకు హాజరు అవుతారు. మార్కెట్ సెక్రటరీ మాత్రం ఉదయం 10:30 గంటలకు అందుబాటులో ఉంటారు. వీరివిధి విధానాలు ఈ విధంగా ఉండడంతో కింది స్థాయి సిబ్బంది చేతి వాటం ఎక్కువైపోయింది.అదిగాక మార్కెట్ లో సంబంధం లేని వ్యక్తులు వ్యాపారం కూడా అదే స్థాయిలో ఊపందుకోవడంతో విశేషం.ఉదాహరణకు "బి:51 షాపు యజమాని"తక్ పట్టి "లో ఎంట్రీ అవుతూ మరోచోట వ్యాపారం జరుగుతుంటే"సినిమా చూస్తున్న మార్కెట్ సిబ్బంది".ఇలా కేవలం బి:51 ఒక్కటే కాదు ఇలాంటివి బోయిన్ పల్లి మార్కెట్ లో కోకొల్లలుగా దర్శనమిస్తాయి.వీటిని "వ్యవసాయ విజిలెన్స్ అధికారులు"కన్న ముందు మార్కెట్ అధికారులు నిఘా పెడితే ఊహకందని నిజాలు బట్టబయలు అవుతాయని
టిఎమ్మార్పీఎస్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి తెలిపారు. ఇంత పెద్ద అవినీతికి తెర లేపిన లైసెన్స్ దారులు పై చర్యలు తీసుకోవాలని,అదికూడా"తక్ పట్టి "లైసెన్స్"స్వాధీనం చేసుకోవాలని అప్పుడే ఇతరులకు కను విప్పు అవుతుందని ఆయన డిమాండ్ చేశారు.ఒకవేళయార్డ్ ఇంచార్జ్,సెక్రటరీ చర్యలు దిశగా అడుగులు వేయకపోతే వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,వ్యవసాయ డైరెక్టర్,మార్కెటింగ్ డైరెక్టర్



విజిలెన్స్ అధికారులను కలిసి లేఖ అందజేస్తామని ఇటుక గోపి వెల్లడించారు. అదిగాక ముసపేట్ లైన్లో జరుగుతున్న అక్రమ వ్యాపార లావాదేవీలు పై పూర్తి స్థాయిలో సాక్ష్యాలు ఉన్నాయని సుమారు వెళ్లమీద లెక్క పెట్టే దుకాణదారుల జాతకాలు సైతం తన వద్ద ఉన్నట్లు పేర్కొన్నారు.ఉదాహరణకు బోయిన్ పల్లి మార్కెట్ లో గత ఐదు రోజుల క్రితం గేట్ ఎంట్రీ అయిన బి:51 వివరాలు పూర్తిస్థాయిలో ఉన్నాయని తెలిపారు. ఇక్కడ అర్థం కానీ విషయం ఏమిటంటే" తక్ పట్టి "లో ఎంట్రీ, కిరాయి లేకుండా మరో చోట




వ్యాపారం.ఇది ఎలా సాధ్యం.? సాధారణంగా బోయిన్ పల్లి మార్కెట్ లో కిరాయిలు లక్షల్లో వసూలు చేస్తున్నారు.? మరి ఈ ప్రక్రియలో జాదుగాళ్ళు ఎలా సర్వే అవుతున్నారని ఆయనప్రశ్నించారు. అసలు మార్కెట్ అధికారులు, కమిటీ ఎందుకు స్పందించడం లేదు,లేక వారి కనుసైగల్లోనే ఇలాంటి రాబందులు పదుల సంఖ్యలో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారా.?

మార్కెట్ లో ఎవరు నటిస్తున్నారో, ఎవరు జీవిస్తున్నారో అర్థం కావాలంటే ఒక్కటే మార్గం అది అధికారుల చోరవ తప్పని సరి. లేకపోతే త్వరలో "వ్యవసాయ విజిలెన్స్ అధికారులకు"ఫిర్యాదు తప్పదని టి ఎమ్మార్పీఎస్ నేత ఇటుక గోపి బాహాటంగా చెబుతున్నారు.మరో విషయం ఏమిటంటే మార్కెట్ అధికారులు రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే "తక్ పట్టి"ఎంట్రీ గోల్ మాల్ "లో జరుగుతున్న లైసెన్స్ దారుల వివరాలు వెల్లడించి, ఉన్నతాధికారులకు సమాచారం అందుచేస్తామని ఆయన అన్నారు.


# సుప్రీంకోర్టులో కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లకు చుక్కెదురు



న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్) గవర్నర్ కోటా ఎమ్మెల్సీలైన కోదండరాం, అమీర్ అలీ ఖాన్లకు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తమపై తెలంగాణ హైకోర్టు విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి శాసనమండలి సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ప్రస్తుత దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ముందుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని ప్రశ్నించిన న్యాయస్థానం, ముందుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సూచించింది. అక్కడ పిటిషన్ తిరస్కరించబడితేనే సుప్రీంకోర్టుకు రావాలని వ్యాఖ్యానించింది.ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాదులు కనీసం విచారణను వాయిదా వేయాలని కోరగా, కోర్టు విచారణను ఏప్రిల్ 22వ తేదీకి వాయిదా వేసింది. దీంతో ఈ వ్యవహారంలో తదుపరి పరిణామాలు హైకోర్టు నిర్ణయంపై ఆధారపడనున్నాయి.

# ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత

## – లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే బల్క్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ.22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది.సాధారణ వాహనాల్లో కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను కూడా లీటరుకు రూ.2.09 మేర పెంచారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.

# మ్యాన్ హోల్స్ మరమ్మతులు మూడునాళ్ళ ముచ్చట

- మ్యాన్ హోల్స్ మరమ్మత్తుల పేరుతో కాంట్రాక్టర్ల, అధికారుల దోపిడీ
- జలమండలిలో మ్యాన్ హోల్స్ మరమ్మత్తులలో భారీ అవకతవకలు
- కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన అధికారులు
- రహదారులపై ఎక్కడ చూసినా నాసిరకం పనులే
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అధికారులు, కాంట్రాక్టర్లు



**తార్నాక (ప్రశ్న న్యూస్)** తార్నాక చౌరస్తా నగర రద్దీకి ప్రతీక. రోజూ వేలాది వాహనాలు, పాదచారులు సంచరించే ఈ ప్రాంతంలో ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా తార్నాక జలమండలి పరిధిలో జరుగుతున్న నాసిరకం మ్యాన్ హోల్స్ పనులు ఇప్పుడు బహిరంగ చర్చకు దారితీస్తున్నాయి. సన్మాన్ హోటల్ పక్కన ఉన్న పెట్రోల్ బంక్ ముందు ఉన్న మ్యాన్‌హోల్స్ మరమ్మత్తుల వ్యవహారం స్థానిక ప్రజలను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనులు చేసి లక్షలు గడుస్తుండగా, ప్రజలు మాత్రం ప్రమాదాలతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
నాసిరకం పనుల బారిన పడుతున్న రహదారి
ఇటీవలే మరమ్మత్తులు చేసిన మ్యాన్‌హోల్స్ కేవలం నెల రోజుల వ్యవధిలోనే పూర్తిగా శిథిలమవడం ఈ పనుల నాణ్యతపై పెద్ద ఎత్తున అనుమానాలు రేకెత్తిస్తోంది. సిమెంట్ బలం లేకుండా, పూర్తిగా దస్తుతో, సరైన మెటీరియల్ వాడకుండా, కేవలం పైకి పూతపూసినట్టుగా పనులు చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. రహదారి మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్స్ కుంగిపోవడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు ఇవి కావడంతోపాటు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ఇది మరింత ప్రమాదకరంగా మారుతోంది.

### కాంట్రాక్టర్లకు వరంగా మారిన అధికారుల నిర్లక్ష్యం..

స్థానికుల వివరాల ప్రకారం ఇది ఒక్కరోజు సమస్య కాదు. దశాబ్దాలుగా కొంతమంది కాంట్రాక్టర్లు జలమండలి పరిధిలో పట్టు సాధించి, అధికారులతో కుమ్మక్కై నాసిరకం పనులు చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. ప్రతి సారి మరమ్మత్తుల పేరిట నిధులు విడుదల అవుతున్నా, పనులలో ఏమాత్రం నాణ్యత ఎక్కడా కనిపించడం లేదు. "పని పూర్తయ్యిందని బిల్లులు వేసుకుంటారు, కానీ రెండు నెలల్లోనే మళ్లీ అదే పని చేయాల్సి వస్తుంది" అని ఒక స్థానిక వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశాడు.

### మామూళ్ల సంస్కృతి మూల కారణమా.?

మ్యాన్ హోల్స్ మరమ్మత్తులలో అవినీతిపై
స్థానికుల ఆరోపణలు మరింత తీవ్రమవుతున్నాయి. అధికారులు తనిఖీలు చేయకపోవడానికి ప్రధాన కారణం "మామూళ్ల" వ్యవస్థనేనని వారు స్పష్టంగా చెబుతున్నారు. కాంట్రాక్టర్లు అధికారులకు లంచాలు ఇచ్చి, పనుల నాణ్యతను పట్టించుకోకుండా నేరుగా బిల్లులు క్లియర్ చేయించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవస్థ వల్లే నిజమైన కాంట్రాక్టర్లు పోటీ చేయలేకపోతున్నారని, అవినీతి కాంట్రాక్టర్లే పదే పదే టెండర్లు గెలుచుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

### ప్రజల ప్రాణాలతో జలమండలి మేనేజర్ల ఆటలు..

మ్యాన్‌హోల్స్ కుంగిపోవడం కేవలం అసౌకర్యమే కాదు ప్రాణాపాయం కూడా. ఎప్పుడైనా వాహనం జారి ప్రమాదం జరగొచ్చు. చిన్న పిల్లలు, వృద్ధులు ఈ ప్రాంతంలో నడవడానికే భయపడుతున్నారు. వర్షాకాలంలో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది. నీటితో నిండిన గుంతలు కనిపించకుండా ప్రమాదాలకు దారి తీస్తాయి.
ఈ అంశంపై తార్నాక జలమండలి మేనేజర్ కు, జిఎంకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు "చూస్తాం, చర్యలు తీసుకుంటాం" అని చెప్పి కాలక్షేపం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. అధికారులు ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల జలమండలిలో ఉన్న కాంట్రాక్టర్లు కాంట్రాక్టర్లు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### నిధుల దుర్వినియోగం.?

ప్రతి సారి మరమ్మత్తుల పేరిట లక్షల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. కానీ పనుల నాణ్యతను చూస్తే ఆ నిధులు నిజంగా పనులకే వినియోగించబడుతున్నాయా అన్న సందేహం కలుగుతోంది. ఒకే మ్యాన్‌హోల్‌ను పదేపదే పదే మరమ్మత్తు చేయడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది రహదారి కాదు, ప్రమాదపు గుంత అంటూ స్థానికులు మండిపడుతున్నారు. వెంటనే నాణ్యమైన పనులు చేయాలని బాధ్యులపై జనమండలి ఎండి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే నిరసనలు చేపట్టేందుకు సిద్ధమని హెచ్చరిస్తున్నారు. మరమ్మత్తుల పని పట్ల కాంట్రాక్టర్, మేనేజర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. మ్యాన్‌హోల్స్ నిర్మాణానికి నిర్దిష్ట ప్రమాణాలు ఉంటాయి. బలమైన కాంక్రీట్, సరైన లోహ కవర్లు, బలమైన బేస్ నిర్మించాలి కానీ ఇక్కడ ఇవేవీ పాటించడం లేదని తెలుస్తోంది. పనులు త్వరగా పూర్తయ్యేలా, ఖర్చు తగ్గించేలా కాంట్రాక్టర్లు తక్కువ నాణ్యత గల మెటీరియల్ వాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యకు బాధ్యత ఎవరికి అనే ప్రశ్న ఇప్పుడు ముందుకొస్తోంది. కాంట్రాక్టర్లదేనా.? లేక పనులను పర్యవేక్షించాల్సిన అధికారులదేనా.? లేక ఇద్దరి కుమ్మక్కేనా.? ప్రజల ఆరోపణలు మాత్రం "ఇద్దరూ బాధ్యులే". పర్యవేక్షణలో లోపం లేకుంటే ఇలాంటి నాసిరకం పనులు జరిగేవి కావని అంటున్నారు. వెంటనే జలమండలి ఎండి స్పందించి నాణ్యమైన మెటీరియల్‌తో తిరిగి పనులు చేయాలి. పనులు పూర్తయ్యే వరకు కఠినంగా పర్యవేక్షణ ఉండాలి. పనుల నాణ్యతను పరీక్షించే స్వతంత్ర సంస్థను నియమించాలని స్థానికులు సూచిస్తున్నారు. అలాగే అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి ప్రజల భద్రత ముఖ్యం రహదారులు ప్రజల కోసం. వాటిపై జరిగే పనులు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పూర్తి నాణ్యతతో చేయాలి. కానీ ఇక్కడ జరుగుతున్నది పూర్తిగా విరుద్ధం. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా నాసిరకం పనులు కొనసాగడం బాధాకరం.తార్నాక చౌరస్తాలో జరుగుతున్న మ్యాన్‌హోల్ మరమ్మత్తుల వ్యవహారం ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. నగరంలో అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇది కేవలం ఒక ప్రాంత సమస్య కాదు, జలమండలి వ్యవస్థలోని లోపాల ప్రతిబింబం. ఇప్పటికైనా ఎండి, ఉన్నత అధికారులు కళ్లు తెరిచి, కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588